సాక్షి ఖమ్మం

మంగళవారం । 6 । ఆగస్టు । 2024



16మంది ఏఓల బదిలీ

ఏఓల బదిలీల్లో భాగంగా 16మందికి స్థానచలనం కలిగింది. ఇందులో ఆరుగురు ఇతర జిల్లాలకు వెళ్తుండగా, జిల్లాకు ఆరుగురు రానున్నారు. 8లో



పరిషత్‌లకు ప్రత్యేకాధికారులు

మండల పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

9న 104 వాహనాల వేలం

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన 104 వాహనాలను ఈనెల 9న వేలం వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ బి.మాలతి తెలిపారు. స్వరాజ్ మజ్దా కంపెనీ 2008 మోడల్‌కు చెందిన 11 వాహనాలను వేలం వేస్తున్నామని పేర్కొన్నారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జరిగే వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు రూ.లక్ష ఖమ్మం వైద్య ఆరోగ్య శాఖ పేరిట డిపాజిట్ చేయాలని సూచించారు. వివరాలకు 96189 54224 నంబర్‌లో లేదా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

పాలేరుకు చేరిన సాగర్ జలాలు



కళకళలాడుతున్న పాలేరు రిజర్వాయర్

కూసుమంచి: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి రెండు రోజుల సాగు అవసరాలకు విడుదల చేసిన నీరు సోమవారం ఉదయం మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు చేరాయి. రిజర్వాయర్‌కు 1,500 క్యూసెక్కుల మేర నీటి సరఫరా జరుగుతుండగా క్రమంగా 4వేల క్యూసెక్కుల వరకు పెంచనున్నారు. దీంతో 23అడుగులు సామర్థ్యం కలిగిన పాలేరులో నీటిమట్టం 16అడుగులకు చేరింది. ఇప్పటికే రిజర్వాయర్ నుండి 250 క్యూసెక్కుల నీటిని పాలేరు పాత కాల్వకు, మరో 250 క్యూసెక్కులు భక్త రామదాసు కాల్వల ద్వారా విడుదల చేస్తుండగా, మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా తాగునీటి అవసరాలకు 130 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు. కాగా, రిజర్వాయర్ నీటిమట్టం 20అడుగులకు చేరాక జిల్లాలోని 2.50లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు ఎడమ కాల్వ ద్వారా నీటి విడుదలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎడమ కాల్వకు నీరు విడుదల చేసి వైరా, లంకాసాగర్ ప్రాజెక్టులను నింపుతారు. సాగర్‌లో పుష్కలంగా నీరు ఉండడంతో పాలేరు రిజర్వాయర్‌కు.. ఇక్కడి నుంచి సాగు అవసరాలకు విడుదలలో ఎలాంటి అడ్డంకులు ఉండవని భావిస్తున్నారు. ఇక భక్త రామదాసు ప్రాజెక్టు రెండో మోటార్ కూడా ఆన్ చేసి ఇరవై రోజుల్లో పాలేరు నియోజకవర్గంలోని అన్ని చెరువులు నింపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పాఠశాలల సంసిద్ధతపై పరిశీలన



డీఈఓ, అధికారులతో సమీక్షిస్తున్న పూజా పాటిల్

ఖమ్మం సహకారనగర్: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యాన ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి విద్యార్థుల పాఠశాల సంసిద్ధతపై సర్వే నిర్వహిస్తున్నారు. ఈ అంశంపై జిల్లాలో 6, 7వ తేదీల్లో సర్వే జరగనుండగా, ఢిల్లీ ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పూజా పాటిల్ వచ్చారు. ఆమె సోమవారం డీఈఓ సోమశేఖర శర్మ, ఏఎంఓ రవికుమార్‌తో సమావేశమై మాట్లాడారు. సంసిద్ధత కార్యక్రమం నిర్వహణ కోసం కేంద్రప్రభుత్వం పుస్తకాన్ని సైతం రూపొందించిందని తెలిపారు. ఈమేరకు మంగళవారం ఖమ్మం ఇందిరానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, 7న ఖమ్మం రూరల్ మండలం మల్లెమడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించనున్నట్లు పూజా పాటిల్ వెల్లడించారు. ఈ బృందంలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు టి.జీవన్, రవి, సూర్యాపేట జిల్లాకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉంటారు. కాగా, ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు, ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులు, విద్యార్థుల, వారి తల్లిదండ్రులతో సమావేశమై నివేదికను కేంద్రప్రభుత్వానికి అందిస్తారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



బహుమతులు అందజేస్తున్న సీసీఎఫ్, డీఎఫ్‌ఓ

సత్తుపల్లిటౌన్: పర్యావరణ సమతుల్యత కోసం అడవుల సంరక్షించడాన్ని అందరూ బాధ్యతగా భావించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) భీమానాయక్ అన్నారు. సత్తుపల్లి మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం అటవీశాఖ ఆధ్వర్యాన వ్యాసరచన పోటీలు నిర్వహించగా విజేతలకు డీఎఫ్‌ఓ సిద్ధార్ విక్రమ్‌సింగ్‌తో కలిసి సీసీఎఫ్ బహుమతులు అందజేసి మాట్లాడారు. ఎఫ్‌డీఓ వి.మంజుల, ఎఫ్‌ఆర్‌ఓ స్నేహలత, డీఆర్‌ఓ ముత్యాలరావు, ఎఫ్‌ఎస్‌ఓ నర్సింహా, ఎఫ్‌బీఓలు ముక్తి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాగుభూములకు సీతారామ





వైరాలో సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన సీపీ సునీల్‌దత్, ఎమ్మెల్యే రాందాస్ తదితరులు (ఇన్‌సెట్) ఏర్పాట్లను ట్యాబ్ ద్వారా నేతలకు వివరిస్తున్న మంత్రి

- ఈనెల 15న జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రాజెక్టు పంప్‌హౌస్‌ల్లో మోటార్లు ఆన్ చేయనున్న సీఎం
- ఆపై వైరాలో రైతు సదస్సుకు హాజరు
- రూ.2లక్షల రుణమాఫీ చెక్కులు పంపిణీ చేయనున్న ముఖ్యమంత్రి
- ఏర్పాట్లను పరిశీలించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 15న ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పంప్‌హౌస్‌ల్లో మోటార్లను ప్రారంభించడంతో పాటు వైరాలో జరిగే రైతు సదస్సులో ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు జరిగిన మేలును ముఖ్యమంత్రి వివరించనున్నట్లు తెలిసింది. అలాగే, మూడో విడతగా రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షల లోపు రుణమాఫీకి సీఎం ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టి కొందరు రైతులకు చెక్కులు అందిస్తారు. ఈమేరకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా పర్యటన ఖరారైందని.. పంపుహౌస్‌ల మోటార్లు ఆన్ చేశాక వైరాలో జరిగే రైతు సదస్సులో ప్రసంగిస్తారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 'సాక్షి'కి తెలిపారు.

ఒకేసారి గోదావరి, కృష్ణమ్మ నీరు..

సీతారామ ద్వారా ఉమ్మడి జిల్లాలో సాగు అవసరాలకు గోదావరి జలాలను విడుదల చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ఈనెల 15న పంప్‌హౌస్‌లను సీఎం ప్రారంభిస్తారు. ప్రాజెక్టుకు సంబంధించి కమలాపురం, పూసుగూడెంల్లో ఏదైనా ఒక చోట సీఎం స్విచాన్ చేస్తారు. ఇక్కడి నుంచి జలాలు వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, పినపాక, మధిర నియోజకవర్గాలకు అందనున్నాయి. ఇక నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమకాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ నీరు కూడా ఉమ్మడి జిల్లాకు చేరుతోంది. దీంతో ఒకేసారి గోదావరి, కృష్ణ జలాలు జిల్లాలో సాగు అవసరాలకు అందుతాయి.

వైరాలో సదస్సు

రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని,, ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేస్తున్నామనే సంకేతాన్ని ఇచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈవిషయాన్ని చాటేలా ఉమ్మడి ఖమ్మం జిల్లాను ఎంచుకుంది. ఇందులో భాగంగా సీతారామ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతోపాటు వైరాలో రైతు సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి భద్రాద్రి జిల్లాకు వస్తారు. అక్కడ సీతారామ పంపుహౌస్‌ల్లో మోటార్లు స్విచాన్ చేసి మధ్యాహ్నం ఒంటిగంటకు వైరాలో ఏర్పాటుచేసే రైతు సదస్సులో పాల్గొంటారు. ఈ సందర్భంగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించి మూడో విడత రుణమాఫీ సందర్భంగా కొందరు రైతులకు చెక్కులు అందిస్తారు. కాగా, ఇటు కృష్ణ, అటు గోదావరి నీళ్లు ఒకేసారి ఉమ్మడి జిల్లాకు అందనున్న నేపథ్యాన వ్యవసాయ కళ ఉట్టిపడేలా సీఎం హాజరయ్యే సభా ప్రాంగణంలో వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఆదర్శ రైతుల అనుభవాలతో స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు.

సభా ప్రాంగణం ఖరారు

వైరాలోని కేవీసీఎం కాలేజీ పక్కన సభ నిర్వహణకు ఖరారు చేశారు. ఈ సభలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి పాల్గొంటారు. ఈమేరకు సభా ప్రాంగణాన్ని సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి పరిశీలించాక సూచనలు చేశారు. సభకు రాష్ట్రవ్యాప్తంగా రైతులు, రైతాంగ ప్రతినిధులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

చరిత్రలో నిలిచిపోయేలా సభ

వైరా: రైతాంగ చరిత్రలో నిలిచిపోయేలా వైరాలో సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈనెల 15న సీఎం పర్యటన సందర్భంగా సభ నిర్వహణకు వైరా కేవీసీఎం కళాశాల సమీపాన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ శాఖకు అనుబంధ శాఖలతో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేస్తామని.. లక్ష మంది రైతులను సమీకరిస్తామని తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సైతం హాజరవుతారని చెప్పారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్‌తో పాటు బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, దొడ్డ పుల్లయ్య, పాదిల హరినాథ్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమై సభ ఏర్పాట్లను 12వ తేదీలోగా పూర్తిచేయాలని తెలిపారు.

ఇప్పటికే ట్రయల్‌రన్ పూర్తి

ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుపై జిల్లా మంత్రులతోపాటు ప్రభుత్వం దృష్టి సారించింది. పెండింగ్ పనులు పూర్తిచేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కావాల్సిన నిధులను విడుదల చేస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి సహా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు మార్లు పనులను పరిశీలించారు. మూడు పంపుహౌస్‌ల్లో అమర్చిన మోటార్లు చైనాకు చెందిన షాంగై ఎలక్ట్రికల్ కంపెనీకి చెందినవి కావడంతో అక్కడి ఇంజనీర్లను రప్పించడంతో ప్రస్తుతం పనులు చకచకా సాగుతున్నాయి. ఇప్పటికే పలు పంప్‌హౌల్లో మోటార్ల ట్రయల్ రన్ కూడా చేపట్టారు.

నమ్మకాన్ని వమ్ము చేయను...



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తదితరులు

- మధిర సమగ్రాభివృద్ధే నా ధ్యేయం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

మధిర: రెండు దశాబ్దాలుగా తనపై నమ్మకంతో గెలిపిస్తున్న ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మధిర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మధిర మండలంలో సోమవారం పర్యటించిన ఆయన పలు లింకు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అల్లినగరం నుంచి బయ్యారం వెళ్లే పీఆర్ రోడ్డు, రాయపట్నం – మడిపల్లి, దేశినేనిపాలెం–మడుపల్లి, మడుపల్లి – శివాపురం వరకు నిర్మించనున్న రహదారులకు శంకుస్థాపన చేశాక కృష్ణాపురం వద్ద భట్టి విక్రమార్కను కాంగ్రెస్ నాయకులు ఎడ్లబండిపై తీసుకెళ్లి సన్మానించారు. ఆతర్వాత మడుపల్లి హైస్కూల్‌ను డిప్యూటీ సీఎం సందర్శించగా పాఠశాల స్థితిగతులను మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత – వెంకటరెడ్డి దంపతులు వివరించారు. తొలుత మధిర మండలం యండపల్లి గుట్టల వద్ద ఇండస్ట్రియల్ పార్క్‌కు టీజీఐఐసీ లిమిటెడ్ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్ తదితరులతో కలిసి భట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ లలిత, కౌన్సిలర్లు మల్లాది వాసు, కోనా ధనికుమార్, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు పోట్ల నాగేశ్వరరావు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సూరంశెట్టి కిషోర్, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, కరివేద సుధాకర్, దుంపా వెంకటేశ్వరరెడ్డి, దారా బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వెంటనే రుణాలు ఇవ్వండి

మధిర: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిన నేపథ్యాన తిరిగి వారికి కొత్తగా రుణాలు ఇవ్వాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. మధిరలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి బ్యాంకర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రూ.లక్షన్నర వరకు రుణాలను మాఫీ చేస్తూ రూ.13 వేల కోట్ల నిధులను విడుదల చేశామని పేర్కొన్నారు. ఈనేపథ్యాన రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశించారు. సహకార బ్యాంకుల్లో రైతులు రుణమాఫీ విషయమై ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం ఉన్నందున అధికారులతో సమన్వయం చేస్తూ పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు సూచించారు. కాగా, బ్యాంకింగ్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఒకే అకౌంట్ ద్వారా సుమారు రూ.30 వేల కోట్లు జమ అవుతున్న విషయాన్ని బ్యాంకర్లు పరిగణనలోకి తీసుకుని రైతులకు సహకరించాలని తెలిపారు.

జెడ్పీ సీఈఓ వినోద్ బదిలీ

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం జిల్లా పరిషత్ సీఈఓ ఎస్.వినోద్ రాజన్న సిరిసిల్ల జిల్లా సీఈఓగా బదిలీ అయ్యారు. ఈమేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయాన హైదరాబాద్‌లోని ట్రైనింగ్ సెంటర్ నుండి వినోద్ జిల్లాకు వచ్చారు. ఆయనను రాజన్న జిల్లాకు బదిలీ చేసినా కొత్తగా ఎవరినీ నియమించలేదు. జెడ్పీ చివరి సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుండగా, ఆతర్వాత వినోద్ రిలీవ్ కానున్నట్లు సమాచారం.

ఫిర్యాదులు పెండింగ్ ఉండొద్దు

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



ఫిర్యాదులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



పలుచగా ఉన్న ఫిర్యాదుదారులు

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందిస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సోమవారం ఆయన వినతిపత్రాలు, ఫిర్యాదులు స్వీకరించాక అధికారులతో మాట్లాడారు. కాగా, మండలాల్లోనూ ఈ వారం నుంచి ప్రజావాణి ప్రారంభించగా కలెక్టరేట్‌కు తక్కువ మందే వచ్చారు. ఇంకొందరు మండలాల్లో గ్రీవెన్స్ మొదలైన విషయ తెలియక వచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ వినోద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంకు చెందిన బి.రజిని తనకు ముగ్గురు ఆడపిల్లలు ఉండగా అందులో కవలలని.. వీరికి ఒక్కో చోట గురుకులంలో ఏడో తరగతిలో సీటు వచ్చినందున ఒకేచోటకు మార్చాలని కోరారు. కొణిజర్ల మండలం తుమ్మలపల్లికి చెందిన మత్స్యకారులు ఆ గ్రామ పరిధిలోని చెరువు చేపల సొసైటీలో సభ్యత్వాలు ఇప్పించాలని విన్నవించారు. ఖమ్మం 8వ డివిజన్‌కు చెందిన అన్నారపు స్వరూప తనకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలని కోరారు.

గ్రీవెన్స్‌లో వైద్యశిబిరం

కలెక్టరేట్‌లో ప్రజావాణి దరఖాస్తుల నమోదు కేంద్రం వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎవరైనా అస్వస్థతకు గురైతే చికిత్స చేసేలా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచనలతో శిబిరం నిర్వహించారు.

ప్రజావాణి షురూ..

- తొలి వారం 536 దరఖాస్తులు
- అత్యధికంగా రెవెన్యూ శాఖపైనే...
- వైరాలో గ్రీవెన్స్‌కు హాజరైన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



వైరాలో దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అన్ని సమస్యలపై కలెక్టరేట్‌కు రాకుండా ప్రజల వ్యయప్రయాసాలు తొలగించాలనే భావనతో ప్రతీ సోమవారం మండల కేంద్రాల్లోగ్రీవెన్స్ డే నిర్వహించాలన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆలోచన కార్యరూపం దాల్చింది. జిల్లావ్యాప్తంగా సోమవారం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు, రైతు వేదికల్లో ప్రజావాణి నిర్వహించారు. అన్నిశాఖల అధికారులు గ్రీవెన్స్‌కు హాజరుకాగా.. జిల్లావ్యాప్తంగా 536 దరఖాస్తులు అందాయి. వీటిని అప్పటికప్పుడే ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వైరాలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై దరఖాస్తులు స్వీకరించారు. బోనకల్‌లో ప్రజావాణికి ఖమ్మం ఆర్డీఓ గణేష్ హాజరు కాగా.. ఎక్కువగా రుణమాఫీ కాకపోవడంతో పాటు భూసమస్యల పరిష్కరించాలని కోరడమే కాక రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఇప్పించాలని విన్నవిస్తూ దరఖాస్తులు అందాయి. కాగా, రెవెన్యూ సమస్యపై అత్యధికంగా అన్ని మండలాల్లో కలిపి 363 దరఖాస్తులు అందగా.. ఇందులో తిరుమలాయపాలెంలోనే 72 దరఖాస్తులు రావడం గమనార్హం. ఇక ఉద్యాన శాఖ, పౌర సరఫరాల శాఖకు సంబంధించి ఒక దరఖాస్తూ అందలేదు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి


వైరా: అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని, తద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. వైరా తహసీల్‌లో ప్రజావాణి(గ్రీవెన్స్ డే)ను పర్యవేక్షించిన ఆయన ప్రజా సమస్యలు స్థానికంగానే పరిష్కారం కావాలనే లక్ష్యంతో మండలాల్లో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్‌తో పాటు అన్ని శాఖల అధికారులుపాల్గొన్నారు.

అన్నింటా రికార్డే..

దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మూడో పంచవర్ష ప్రణాళికలో పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేశారు. దీంతో దేశవ్యాప్తంగా 1960వ దశకంలో థర్మల్ పవర్ స్టేషన్ల నిర్మాణం ఊపందుకుంది. ఈ క్రమంలో పాల్వంచలో కొత్తగూడెం థర్మల్ విద్యుత్ స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాలం తీరడంతో ఇప్పుడు కూల్చేశారు. అయితే కూల్చివేత పనుల్లోనూ కేటీపీఎస్ అనేక రికార్డులు సొంతం చేసుకుంది. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

కేటీపీఎస్ టవర్ల నిర్మాణం, కూల్చివేతల్లో ప్రత్యేకత

- 1960వ దశకంలో సవాళ్ల మధ్య పూర్తయిన పనులు
- ఆ తర్వాత ఊపందుకున్న పారిశ్రామిక రంగం
- కాలం చెల్లడంతో ప్రస్తుతం కాలగర్భంలోకి..



కేటీపీఎస్ ఓఅండ్ఎం 'ఏ' స్టేషన్‌లోని టవర్లు



సీ స్టేషన్‌లో నేలమట్టమవుతున్న రెండు టవర్లు



టవర్లు కూల్చివేత తర్వాత ఇలా..

ఎనిమిది యూనిట్లు..

కేటీపీఎస్ ప్లాంట్ నిర్మాణానికి జపాన్ సాంకేతిక సహకారం అందించగా తొలి యూనిట్ నిర్మాణానికి రూ.59.29 కోట్లు ఖర్చయ్యాయి. కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రం (కేటీపీఎస్) తొలి యూనిట్ 60 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో 1966 సెప్టెంబర్ 4న ప్రారంభమైంది. ఆ తర్వాత మరో మూడు యూనిట్లు 1967లో అందుబాటులోకి వచ్చాయి. ఈ నాలుగు యూనిట్లు (600x4=240) కలిపి కేటీపీఎస్ ఏ ప్లాంట్‌గా పేర్కొనేవారు. ప్లాంట్-ఏలో ఒక్కో కూలింగ్ టవర్ 102 మీటర్ల ఎత్తులో నిర్మించారు. అనంతరం కేటీపీఎస్ విస్తరణలో భాగంగా 1974లో 120x2=240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో కేటీపీఎస్ ప్లాంట్ బీ, 1978లో 120x2=240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ సీ మొదలయ్యాయి. బీ, సీ ప్లాంట్లలోని కూలింగ్ టవర్లను 115 మీటర్ల ఎత్తులో నిర్మించారు.

కట్టడానికి ఆఫ్రికా కూలీలు..

కేటీపీఎస్ నిర్మాణం అనేక సవాళ్ల మధ్య ముందుకు సాగింది. ముఖ్యంగా 102 మీటర్లు (335 అడుగులు) ఎత్తుతో నిర్మించే కూలింగ్ టవర్, అంతే ఎత్తుతో ఉండే చిమ్నీల నిర్మాణం అప్పటి అధికారులు, ఇంజనీర్లకు సవాల్‌గా మారింది. ఎత్తయిన కూలింగ్ టవర్ల నిర్మాణ పనుల్లో భాగమయ్యేందుకు స్థానికులు భయపడ్డారు. దీంతో ఆఫ్రికా నుంచి కూలీలను రప్పించి నిర్మాణ పనులు మొదలెట్టారు. అప్పటికీ కూలీల కొరత ఉంటే ఒడిశాలోని పారదీప్ నుంచి మరికొందరిని రప్పించారు. అలా నాలుగేళ్లకు పైగా శ్రమించి కేటీపీఎస్ ప్లాంట్ 'ఏ' అందుబాటులోకి తెచ్చారు. దట్టమైన అడవుల మధ్య కొండల కంటే ఎత్తుగా నిర్మించిన కూలింగ్ టవర్లను అంతా ఆశ్చర్యంగా చూసేవారు. ముఖ్యంగా ఆ రోజుల్లో భద్రాచలం శ్రీరాముడి దర్శనానికి వచ్చే భక్తులు కూలింగ్ టవర్లను వింతగా చూసేవారు.

పరిశ్రమలకు ఊపిరి..

కేటీపీఎస్ ప్రారంభంతో జిల్లాలో పారిశ్రామిక రంగంలో జోరు పెరిగింది. 1970వ దశకంలో ఏపీ స్టీల్స్, నవభారత్ ఫెర్రోఎల్లాయిస్, స్పాంజ్ ఐరన్ కర్మాగారం, బేరియం కెమికల్స్, భద్రాచలం పేపర్ బోర్డు లిమిటెడ్, ఏపీ రేయాన్స్ (మంగపేట, ములుగు జిల్లా), మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ వంటి పరిశ్రమలను చకచకా స్థాపించారు. సింగరేణి బొగ్గు గనుల్లో యాంత్రీకరణ ఊపందుకుంది. అంతేకాదు.. 1980వ దశకం వచ్చే సరికి హైదరాబాద్ నగర విద్యుత్ అవసరాలకు కేటీపీఎస్ ప్లాంటే ప్రధానంగా మారింది. అప్పటి కేటీపీఎస్ ఆడిట్ లెక్కల ప్రకారం హైదరాబాద్‌కు సరఫరా చేసిన విద్యుత్ బిల్లులు ఉద్యోగుల జీతాలు, నిర్వహణ, పెన్షన్‌లకు సరిపోయేవి. అయితే జీవిత కాలం ముగిసిపోవడంతో కేటీపీఎస్ ఏ, బీ, సీ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి కూల్చివేత పనులు చేపట్టారు.

కూల్చేందుకు రాజస్థాన్ సంస్థ..

ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం బ్లాస్టింగ్ లేకుండా కూలింగ్ టవర్లను కూల్చేయాల్సి ఉంది. కానీ అందుకు ఎక్కువ సమయం పట్టడంతో పాటు అనేక ఇబ్బందులు ఉండటంతో కంట్రోల్డ్ ఇంప్లోషన్ టెక్నిక్ సాయంతో పేలుడు పదార్థాలను అమర్చి క్రమ పద్ధతిలో పేల్చడం ద్వారా కూలింగ్ టవర్లను నేలమట్టం చేయాలని నిర్ణయించారు. రాజస్థాన్‌కు చెందిన ఎక్స్‌క్యూడ్ సంస్థను ఇందుకు ఎంపిక చేశారు. ఈ సంస్థ గుజరాత్‌లోని సూరత్ దగ్గరున్న 85 మీటర్ల కూలింగ్ టవర్ కూల్చివేత పనులను 2023 మార్చిలో విజయవంతంగా పూర్తి చేసింది. కేటీపీఎస్ టవర్ల కూల్చివేతకు 2,400 కేజీల పేలుడు పదార్థాలు ఉపయోగించినట్టు సమాచారం. వీటిని సరైన రీతిలో అమర్చేందుకు 30 మంది నిపుణులు సుమారు నెల రోజుల పాటు పని చేశారు.

ఆరు నుంచి ఎనిమిది సెకన్లలో..

కూలింగ్ టవర్ల కూల్చివేత విషయానికి వస్తే దేశంలో ఇప్పటి వరకు పేలుడు ద్వారా కూల్చేసిన కూలింగ్ టవర్లలో గాంధీనగర్ (గుజరాత్) టవర్ ఎత్తు 118 మీటర్లు ఉంది. ఒకేసారి అత్యధిక కూల్చివేతల్లో పానిపట్ (హరియాణా)లో 105 మీటర్లు కలిగిన మూడు కూలింగ్ టవర్లు ఉన్నాయి. వీటిని పది సెకన్ల వ్యవధి తేడాతో కూల్చారు. ఇక కేటీపీఎస్‌లోని బీ, సీ యూనిట్లలో 115 మీటర్లు ఎత్తులో ఉండగా ఒకే రోజు ఎనిమిది కూలింగ్ టవర్లను కూల్చివేశారు. కంట్రోల్డ్ ఇంప్లోషన్ టెక్నిక్ కూల్చివేతల్లో తెలంగాణలో ఇదే మొదటిది. ఇక కేటీపీఎస్ ఏ,బీ, సీ యూనిట్లను స్క్రాప్‌గా అమ్మడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.485 కోట్ల ఆదాయం వచ్చింది. స్క్రాప్ అమ్మకాల్లోనూ ఇది ఒక రికార్డే.

క్లుప్తంగా

8న జాబ్‌మేళా

ఖమ్మం రాపర్తినగర్: హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 8వ తేదీన టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ పూర్తిచేసిన వారు ఫార్మసిస్ట్ పోస్టులకు, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన వారు రిటైల్ ట్రెయినీ అసిస్టెంట్ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. 18నుంచి 35ఏళ్ల వయస్సు కలిగిన వారు విద్యార్హుల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉదయం 10 గంటలకు మొదలయ్యే జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు.

డీఆర్‌గా రవీందర్‌రావు బాధ్యతల స్వీకరణ

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా ఎం.రవీందర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో జిల్లా రిజిస్ట్రార్‌గా ఉన్న అశోక్‌కుమార్ అదిలాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నియమితులైన రవీందర్‌రావు విధుల్లో చేరగా కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆడిట్ బృందం తనిఖీ



డీఈఓ కార్యాలయంలో వివరాలు పరిశీలిస్తున్న బృందం

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖకు మంజూరయ్యే ఎస్ఎస్ఏ నిధుల వ్యయంపై ఆడిట్ బృందం తనిఖీలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా సోమవారం డీఈఓ కార్యాలయం అకౌంటింగ్ విభాగంలో రికార్డులను అధికారులు పరిశీలించారు. జిల్లాకు రెండు బృందాలు చేరుకోగా నాలుగు మండలాల్లో ఆడిట్ నిర్వహిస్తారని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. 2023–24వ విద్యాసంవత్సరానికి సంబంధించి ఆడిట్ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తారు.

పాపటపల్లి కార్యదర్శికి షోకాజ్ నోటీసు

ఖమ్మంవన్‌టౌన్: రఘునాథపాలెం మండలంలోని పాపటపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి కాసుల వెంకటరమణకు జిల్లా పంచాయతీ అధికారి హరికృష్ణ సోమవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆయనపై ఇటీవల అవినీతి ఆరోపణలు రావడంతో ఈ నోటీసు జారీ చేయగా.. విచారణ జరిపి నివేదిక అందించాలని డీఎల్‌పీఓను ఆదేశించారు.

జ్వరాల తీవ్రతపై అసిస్టెంట్ కలెక్టర్ ఆరా



జల్లేపల్లిలో సిబ్బందితో మాట్లాడుతున్న మ్రినాల్ శ్రేష్ఠ

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లేపల్లి, పాతర్లపాడు, తిప్పారెడ్డిగూడెం తదితర గ్రామాల్లో డెంగీ కేసులు నమోదవుతుండడం, పలువురు జ్వరాల బారిన పడిన నేపథ్యాన అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ సోమవారం తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాలను పరిశీలించాక జ్వరాల తీవ్రతపై ఆరా తీశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, దోమల నివారణకు చర్యలపై ఎంపీడీఓ సిలార్ సాహెబ్‌తో చర్చించారు. అలాగే, వైద్య శిబిరాలపై డాక్టర్ రామారావును పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేసి జ్వరతీవ్రత ఉన్న గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ చోరీ

చింతకాని: మండలంలోని కొదుమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. ఈ మేరకు రెండింట్లోని రాగి తీగ అపహరించుకుని వెళ్లారు. ఘటనపై ఏఈ వెంకన్న ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం ఉదయం పోలీసులు పరిశీలించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,400	5,500
మిర్చి	17,900	10,800
మిర్చి తాలు	9,000	7,000
ఏసీ మిర్చి	19,500	10,000
ఏసీ తాలు	10,000	9,000
పత్తి	7,275	4,500

– ఖమ్మం వ్యవసాయం


పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,828

టవర్లు ఇక జ్ఞాపకాల్లోనే..

- ప్రశాంతంగా కూలింగ్ టవర్ల కూల్చివేత
- కేటీపీఎస్‌లో నాడు 12 టవర్లు.. ఇక నుంచి నాలుగే
- కూల్చివేతను ఆసక్తిగా తిలకించిన పాల్వంచ వాసులు
- గుర్తులు చెదిరిపోతుండటంతో సెల్‌ఫోన్లలో చిత్రీకరణ





కూలింగ్ టవర్లు కూల్చిన తర్వాత కర్మాగారం ప్రాంతం, (ఇన్‌సెట్) కూలింగ్ టవర్లు కూల్చక ముందు..

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారంలో ఓఅండ్‌ఎం (పాత ప్లాంట్) శకం ముగిసింది. కర్మాగారంలోని అన్ని విభాగాలతో పాటు కూలింగ్ టవర్లు సైతం కనుమరుగయ్యాయి. ఓఅండ్‌ఎం కర్మాగారంలో ఎనిమిది యూనిట్లకు గాను ఎనిమిది కూలింగ్ టవర్లు, 5, 6వ దశల్లో 9, 10, 11 యూనిట్లకు గాను మూడు, 7వ దశకు సంబంధించి 12వ యూనిట్‌లో ఒక కూలింగ్ టవర్ పట్టణానికి ఐకాన్‌గా నిలిచేవి. ఇందులో ఓఅండ్‌ఎం కర్మాగారం కాలం చెల్లడంతో ఇప్పటికే ఇతర నిర్మాణాలను తుక్కుగా మార్చిన నేపథ్యాన సోమవారం ఏకకాలంలో ఎనిమిది టవర్లను నేలమట్టం చేశారు. దీంతో పాల్వంచకు ఒక గుర్తులు నిలిచే టవర్లులేక బోసిపోయినట్లుగా మారిందని స్థానికులు చెబుతున్నారు.

పాల్వంచకు ఐకాన్..

పాల్వంచ అంటే మొదట గుర్తొచ్చేది కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్). ఆపై ఈ కూలింగ్ టవర్లేనని చెప్పాలి. చుట్టూ కొన్ని మైళ్ల దూరం వరకు ఈ టవర్లు కనిపిస్తుంటాయి. 1965–78 సంవత్సరంలో కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారాన్ని నిర్మించారు. ఇందులో ఏ–స్టేషన్‌లో 60 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 1, 2, 3, 4యూనిట్లు ఉంటాయి. తొలుత 'ఏ' స్టేషన్‌ను జపాన్ టెక్నాలజీతో నిర్మించారు. ఆపై బీ, సీ స్టేషన్లలో 120 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5, 6, 7, 8 యూనిట్లను స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించగా రాష్ట్రానికి వెలుగులు పంచాయి. కాగా, ఒక్కో స్టేషన్‌కు ఒక్కో కూలింగ్ టవర్ చొప్పున ఎనిమిది నిర్మాణాలు ఉన్నాయి. విద్యుత్ ఉత్పత్తి చేసే క్రమాన నీరు, బొగ్గు మండించినప్పుడు వచ్చే వేడిని తగ్గించేందుకు ఈ టవర్లు ఉపయోగపడుతాయి. ఎంతో నాణ్యతగా నిర్మించిన టవర్లు కావడంతో ఇప్పటికీ చెక్కుచెదరక పోవడం గమనార్హం.

కొంత సేపు ట్రాఫిక్ ఆంక్షలు

కూలింగ్ టవర్ల కూల్చివేత సమయాన వాహనాలు, ప్రజల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. కర్మాగారం చీఫ్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావు అధికారులతో కలిసి టవర్ల కూల్చివేతను పర్యవేక్షించారు. పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్, సీఐ వినయ్‌కుమార్, ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎ.అప్పాజీ, ఇన్‌స్పెక్టర్ కిరణ్, జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ రమేశ్, ఎస్ఈ కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం కరకవాగు, అల్లూరిసెంటర్, పాండురంగాపురం రోడ్లలో ఎవరూ తిరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అటుగా తిరిగే వాహనాలను నిలిపివేశారు. కూల్చివేత పూర్తయ్యాక సీఈ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎలాంటి సమస్య రాకుండా పనులను పూర్తిచేసిన హెచ్‌ఆర్, ఎక్సిక్యూడ్, కేటీపీఎస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. కాగా, కూలింగ్ టవర్ల కూల్చివేత దృశ్యాలను కేటీపీఎస్ ఉద్యోగ, కార్మికులు సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఆసక్తి చూపారు. అనంతరం ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

స్టేషన్ల వారీగా కూలింగ్ టవర్లు, వాటి వివరాలు			మీటర్లలో...			
			భూమట్టం	మధ్యలో	టాప్ లెవల్	ఎత్తు
స్టేషన్	యూనిట్లు	టవర్లు	విస్తీర్ణం	విస్తీర్ణం	విస్తీర్ణం	
ఏ	1 - 4	4	70	36.55	42.00	102
బీ	5 - 6	2	92.31	55.10	61.64	115
సీ	7 - 8	2	92.31	55.10	61.64	115

మండల పరిషత్‌లకు ప్రత్యేక అధికారులు

- ముగిసిన పాలకవర్గాల పదవీకాలం
- అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు

ఖమ్మంవన్‌టౌన్: మండల ప్రజా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం సోమవారం ముగిసింది. ఈ నేపథ్యాన జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలనా సౌలభ్యం కోసం వీరిని నియమించారు. ఈమేరకు బోనకల్ మండల ప్రత్యేకాధికారిగా విజయ్‌భాస్కర్‌రెడ్డి(కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్), చింతకానికి పౌర సరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, ఏన్కూరుకు మైన్స్ ఏడీ ఆర్.సాయినాథ్, కల్లూరుకు మార్క్‌ఫెడ్ డీఎం పి.సునీత, కామేపల్లికి భూగర్భ జల వనరులశాఖ డీడీ బి.శ్యాంప్రసాద్‌రావు, ఖమ్మం రూరల్ మండలానికి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జి.జ్యోతి, కొణిజర్లకు డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి, కూసుమంచి మండలానికి పౌర సరఫరాల సంస్థ డీఎం జి.శ్రీలతను ప్రత్యేకాధికారులకు నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. అలాగే, మధిరకు సీపీఓ ఏ.శ్రీనివాస్, ముదిగొండకు ట్రైబల్ వెల్ఫేర్ డీడీ ఎన్.విజయలక్ష్మి, నేలకొండపల్లికి డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, పెనుబల్లికి సర్వే, ల్యాండ్ రికార్డ్ ఏడీ డి.శ్రీనివాసులు, రఘునాథపాలెంకు మైనార్టీ సంక్షేమాధికారి మహమూదీ, సత్తుపల్లికి డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు. సింగరేణికి పరిశ్రమల శాఖ జీఎం అజయ్‌కుమార్, తల్లాడకు ఫిషరీస్ ఏడీ జి.రాజనర్సయ్య, తిరుమలాయపాలెంకు డీపీఓ విజయనిర్మల, వేంసూరుకు అసిస్టెంట్ ఆడిట్ అధికారి హుస్సేన్, వైరాకు ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ, ఎర్రుపాలెంకు పశు సంవర్ధకశాఖ అధికారి బి.వేణుమనోహర్‌ను ప్రత్యేకాధికారులుగా నియమించారు.

16 మంది వ్యవసాయాధికారుల బదిలీ

వ్యవసాయ శాఖలో ఏఓల బదిలీకి సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించగా జిల్లాలో 16 మంది అధికారులకు స్థానచలనం కలిగింది. ఈమేరకు జిల్లా నుంచి ఆరుగురు ఏఓలు పొరుగు జిల్లాలకు వెళ్లగా.. ఇతర జిల్లాల నుంచి ఆరుగురిని ఇక్కడకు కేటాయించారు. ఈసందర్భంగా బదిలీ ఏఓల వివరాలు ఇలా ఉన్నాయి.

– ఖమ్మంవ్యవసాయం

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
మంద ప్రసాద్	ఏఓ(టెక్నికల్), ఖమ్మం	నేలకొండపల్లి
ఎస్.నరిత	బోనకల్	ముదిగొండ
బి.రామకృష్ణ	ఏఓ(ఎఫ్‌టీసీ) ఖమ్మం	ఏఓ(టెక్నికల్), ఇల్లెందు
ఏ.శ్రీదేవి	ఏఓ(బీసీ ల్యాబ్)	ఏఓ(టెక్నికల్), మరిపెడ
కె.విజయ్‌భాస్కర్‌రెడ్డి	ఎర్రుపాలెం	బోనకల్
ఎస్‌వీకే.నారాయణరావు	నేలకొండపల్లి	ఏఓ(బీసీ ల్యాబ్), ఖమ్మం
పి.వాహిణి	ఏఓ(ఎస్‌టీఎల్), ఖమ్మం	దంతాలపల్లి
ఇంటూరి భాస్కర్‌రావు	రఘునాథపాలెం	ఎఫ్‌టీసీ, ఖమ్మం
టి.ఛాయారాజ్	ఏఓ(టెక్నికల్), ఖమ్మం	సీరోలు
వి.నాగేశ్వరరావు	ఖమ్మం రూరల్	ఏఓ(ఎస్‌టీఎల్), ఖమ్మం
మందుల రాధ	ముదిగొండ	ఎర్రుపాలెం
బి.వినయ్‌కుమార్	ఏఓ(ఎస్‌టీఎల్), ఖమ్మం	నర్సింహులపేట
ఎస్.పవన్‌కుమార్	వైరా	ఏఓ(టెక్నికల్), ఖమ్మం
కె.ఉమామహేశ్వరరెడ్డి	సింగరేణి	రఘునాథపాలెం
కె.రాజు	ఏఓ(ఎస్‌టీఎల్), ఖమ్మం	ఏఓ(టెక్నికల్), మహబూబాబాద్
జె.ఉమానగేష్	ఏఓ(టెక్నికల్), ఖమ్మం	ఖమ్మం రూరల్
బి అశోక్ కుమార్	కొత్తగూడెం	సింగరేణి
బి గోపాల్‌రావు	కొత్తగూడెం	ఎస్‌టీఎల్ ఖమ్మం
మంజూఖాన్	మహబూబాబాద్	వైరా
వై.నవీన్	అశ్వారావుపేట	ఏఓ(టెక్నికల్), ఖమ్మం
రాంబాబు	వరంగల్	ఏఓ(టెక్నికల్), ఖమ్మం
జి.వెంకటరామారావు	భద్రాచలం	ఎస్‌టీఎల్, ఖమ్మం

బకాయిలు తక్షణమే విడుదల చేయాలి



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు, మెస్ చార్జీల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంతో పాటు బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో పీడీఎస్‌యూ ఆధ్వర్యాన ఖమ్మంలోని కాల్వొడ్డు నుండి మయూరిసెంటర్ మీదుగా కిన్నెర సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆజాద్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వ విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తోందని విమర్శించారు. ఇకనైనా నిర్లక్ష్యాన్ని విడనాడి బకాయిలు చెల్లించడంతో పాటు ఖమ్మంలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.లక్ష్మణ్, వి.వెంకటేష్, నాయకులు సతీష్, శశి, వినయ్, కార్తీక్, ప్రసాద్, వంశీ, గోపి, నరేందర్, మమత, సంధ్య, శ్రీలక్ష్మి, భూమిక, అనూష తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఓ మోస్తరు వాన

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఓ మోస్తరు వాన కురిసింది. నైరుతి ఉపరితల గాలుల ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం నమోదైంది. ఖమ్మం పరిసర ప్రాంతాల్లో వర్ష ప్రభావం కనిపించినట్లు అధికారులు వెల్లడించారు. రఘునాథపాలెంలో అత్యధికంగా 26 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా, తిరుమలాయపాలెంలో 22.5, కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో 21.5, గేటు కారేపల్లిలో 13, మంచుకొండలో 12.8, పల్లెగూడెంలో 9.5, లింగాలలో 6.8, పంగిడిలో 4.8, ఖమ్మం ఎన్ఎస్‌పీ గెస్ట్‌హౌస్ వద్ద 4.3, బచ్చోడులో 3.5 మి.మీల వర్షపాతం నమోదైంది. కాగా, ఈ వర్షం సాగులో ఉన్న పైర్లకు ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. వరి నాట్లకు ఉపయోగమని తెలిపారు.



జిల్లా కేంద్రంలో వర్షంలోనే వెళ్తున్న వాహనదారులు

ఉదయం అక్కడ.. సాయంత్రం ఇక్కడ!

ట్రెజరీ డీడీగా వెంటపల్లికి అదనపు బాధ్యతలు



సత్యనారాయణకు శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్(ఎఫ్ఏసీ)గా వెంటపల్లి సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఖమ్మంలో డీడీగా పనిచేస్తుండగా ఇటీవల మహబూబాద్ డీటీఓలో ఏడీగా బదిలీ చేశారు. ఈమేరకు సోమవారం ఉదయం మహబూబాబాద్‌లో బాధ్యతలు స్వీకరిస్తుండగానే ఖమ్మం డీడీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు అందాయి. దీంతో సాయంత్రం ఖమ్మం చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఆయనను టీజీఓస్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, ఉద్యోగ సంఘాల నాయకులు నయీంపాషా, డీ.పీ.గణేష్, ప్రసన్నకుమార్, కృష్ణకుమారి, రామకృష్ణ, సాయి, ప్రవీణ్, కంచి శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, రవీంద్రబాబు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్ట్



నిందితులను చూపిస్తున్న సీఐ వినయ్‌కుమార్

పాల్వంచ: పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పాల్వంచ సీఐ వి.వినయ్‌కుమార్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 4న నటరాజ్ సెంటర్‌లో పట్టణ ఎస్ఐ రాఘవయ్య వాహన తనిఖీలు చేపట్టగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. సదరు వ్యక్తి ఆటోడ్రైవర్ తూరపాటి ప్రసాద్ అని తేలగా ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం.బంజరకు చెందిన ఆయన హైదరాబాద్ అల్వాల్ ఏరియాలో ఉంటున్న పాత నేరస్తుడిగా గుర్తించారు. జూన్ 28వ తేదీన పాల్వంచ ఒడ్డుగూడెం ఏరియాలో 49 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, రూ.20 వేల నగదు చోరీ చేసి హైదరాబాద్ ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో తాకట్టు పెట్టినట్లు తేలింది. అంతేకాక కొంత బంగారం అమ్మి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ కొనుగోలు చేసిన ప్రసాద్ గతంలో వరంగల్, ఖమ్మం, పాల్వంచ, మణుగూరు, కాజీపేట, హసన్‌పర్తి ఏరియాల్లో 30 చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చాడని సీఐ తెలిపారు. ఈ ఏడాది పాల్వంచలోనే కాక ఖమ్మం దొరన్నకాలనీ, టీఎన్జీవోస్ కాలనీ, అశ్వాపురం మండలం మొండికుంట, కోదాడలోని పెరిక హాస్టల్, సర్దార్ వల్లభాయ్ పటేల్‌నగర్ రోడ్‌లో చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడని వెల్లడించారు. ఇక సోమవారం చేపట్టిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన పాల్వంచ మండలం మొండికట్టకు పొన్నాల శివశంకర్‌ను అదుపులోకి తీసుకోగా ఐఎం కాలనీ, కరీంనగర్, జమ్మికుంట, రామగిరి, గోదావరి ఖని ఏరియాల్లోనూ చోరీలకు పాల్పడినట్లు తేలిందని సీఐ వినయ్‌కుమార్ తెలిపారు. ఆయనను నుంచి ఖమ్మంలో చోరీ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను స్వాధీనం చేసుకోగా.. ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌కు గాయాలు

చింతకాని: విద్యుదాఘాతంతో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్, నర్సింహాపురానికి జల్లి రాముకు తీవ్ర గాయాలయ్యాయి. చింతకాని రూరల్ ఫీడర్ పరిధిలోని ఒక ట్రాన్స్‌ఫార్మర్‌లో సోమవారం సమస్య తలెత్తగా మరమ్మత్తు చేసేందుకు సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకున్నాడు. అయితే, ఎల్‌సీ తీసుకున్న ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోనివిద్యుత్ కాకుండా సమీపంలోని మరో స్తంభం ఎక్కడంతో షాక్‌కు గురైన రాము స్తంభం పైనుంచి కింద పడ్డాడు. ఈఘటనలో ఆయన చేతులు, కాళ్లు కాలిపోగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఆయనను ఏఈ వెంకన్న పరామర్శించగా.. విద్యుత్ సిబ్బంది పూర్తి అవగాహన లేని ప్రైవేట్ వ్యక్తితో పనిచేయించడంతోనే ఇలా జరిగిందని పలువురు ఆరోపించారు.

ఇల్లెందు యువకుడికి...

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామ పంచాయతీ ఎల్లాపురం గ్రామానికి చెందిన గుగులోత్ సతీశ్ సోమవారం విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఎల్లాపురం గ్రామ శివారులో విద్యుత్ తీగలు తెగిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని రైతులు నేరుగా విద్యుత్ శాఖ లైన్‌మెన్‌కు తెలిపారు. దూర ప్రాంతంలో విధుల్లో ఉన్న లైన్‌మెన్ ఎల్‌సీ ఇప్పించి లైన్ సరిచేసుకోవాలని రైతులకు సూచించారు. దీంతో స్థానికంగా స్తంభాలు ఎక్కడం, జాయింట్ చేయడంలో అనుభవం కలిగి ఉన్న సతీశ్‌తోపాటు మరో ఇద్దరి సాయంతో వైర్ల జాయింట్ పనులు ప్రారంభించారు. దీనికోసం స్తంభం ఎక్కిన సతీశ్ లైన్ సరిచేస్తుండగా సమీపంలో ఇదే లైన్‌ను క్రాస్ అవుతున్న మరో లైన్ తీగలు తగలడంతో విద్యుత్ సరఫరా జరిగి విద్యుదాఘాతానికి గురై స్తంభం పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్పందించిన స్థానికులు వెంటనే సతీశ్‌ను ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలించారు.

ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు



రవి (ఫైల్)



నది వద్ద వేచి ఉన్న పోలీసులు, బంధువులు

మధిర: మధిరలోని బంజారా కాలనీకి చెందిన అద్దంకి రవి(18) స్థానిక వైరా నదిలో సోమవారం ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. ఆయన ఆచూకీ కోసం గాలింపు చేపట్టినా రాత్రి వరకు ఫలితం కానరాలేదు. దీంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది, మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ బాధ్యులు గాలింపు నిలిపేశారు. కాగా, యువకుడి బంధువులు, స్థానికులు వైరా నది వద్ద గంటల తరబడి వేచి చూసినా రవి జాడ తెలియకపోవడంతో నిరాశగా వెనుతిరిగారు


ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఖమ్మం సారధినగర్‌కు చెందిన ఎర్రబోయిన రామనాథం(68) ఆదివారం నాడు చర్చికి వెళ్లి వచ్చే సమయాన రోడ్డు దాటుతుండగా ఓ ద్విచక్రవాహనదారుడు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన రామనాథం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై ఆయన కుమారుడు అప్పారావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌లోని బెస్త కాలనీ సమీపాన ఓ వ్యక్తి వరంగల్ వైపు వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ కింద పడి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. లోకోపలట్ సమాచారంతో జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు, సిబ్బంది ఘటనాస్థలంలో మృతదేహాన్ని గుర్తించారు. ఆయన వద్ద ఉన్న 'రామకృష్ణ, సత్తుపల్లి మండలం కాకర్లపల్లి' అంటూ ఫోన్‌నంబర్లతో కూడిన చీటీ లభించడంతో వారికి సమాచారం ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని అన్నం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించగా మృతుడి వివరాలపై స్పష్టత రావాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

హాస్టల్‌కు వద్దన్నందున...



మల్లేశ్వరి (ఫైల్)

కారేపల్లి: 'నీ ఆరోగ్యం కుదుటపడలేదు, హాస్టల్‌కు వద్దు, ఇంటి వద్దే ఉండు' అని చెప్పినందున ఓ ఇంటర్ విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని పంతుల్‌నాయక్ తండా గ్రామానికి చెందిన బోడ మల్లేశ్వరి(17) ఖమ్మంలోని ఓ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమెను ఇంటికి తీసుకొచ్చి చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. ఈక్రమంలోనే 2వ తేదీన తాను తరగతులు కోల్పోతున్నందున హాస్టల్‌కు వెళ్తానని చెబితే తల్లిదండ్రులు ఇంకొన్ని రోజులు ఉండాలని చెప్పారు. ఆతర్వాత వారు పొలానికి వెళ్లగా మల్లేశ్వరి పురుగుల మందు తాగింది. తల్లిదండ్రులు వచ్చేసరికి ఆమె వాంతులు చేసుకుంటుండడంతో ఆరా తీయగా పురుగుల మందుతాగినట్లు చెప్పడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.